

రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన కేజీబీవీ విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో పట్టణంలోని కేజీబీవీలో చదువుతున్న డి. సానియా పాల్గొని అద్భుత ప్రతిభను కనపరిచినట్లు పాఠశాల హెచ్‌ఎం మాధవి పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సానియాను పాఠశాల ఆవరణంలో మంగళవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో మెరిసిన సానియాను జాతీయస్థాయి పోటీలకు కూడా తీర్చిదిద్దేందుకు శిక్షణను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటి సావిత్రి, జూడో ఎన్ఐఎస్ కోచ్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సానియాను అభినందిస్తున్న దృశ్యం

బాలేపాలెంలో టంగ్‌స్టన్ తవ్వకాలు

హిందుస్థాన్ జింక్‌కు అనుమతులు



టంగ్‌స్టన్ ముడిఖనిజం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం బాలేపాలెంలో టంగ్‌స్టన్ ఖనిజం తవ్వకాలకు హిందూస్థాన్ జింక్ సంస్థ అనుమతులు పొందింది. ఈ మేరకు మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలో 308.30 హెక్టార్లలో తవ్వకాలు, అన్వేషణ కోసమని కాంపోజిట్ లైసెన్సును మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది మేజరు మినరల్ పరిధిలోకి రావడంతో కేంద్ర ఖనిజ మంత్రిత్వ శాఖ గతేడాది ఈ యాక్షన్ నిర్వహించింది. ఇందులో 0.655 శాతం అధికంగా హిందుస్తాన్ జింక్ సంస్థ కోటేషన్ దాఖలు చేసింది. దీంతో ఆ సంస్థకే కాంట్రాక్టును అప్పగించారు. ఈ కంపెనీ రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో టంగ్‌స్టన్ ఖనిజ అన్వేషణతోపాటు తవ్వకాలు చేపట్టేందుకు వీలుంటుంది. అనుమతులిచ్చిన 308.30 హెక్టార్లలో రైతుల పొలాలుంటే వారి నుంచి అనుమతులను ముందుగా ఆ కంపెనీనే తీసుకోవాల్సి ఉంటుంది.

పారిశ్రామిక అవసరాల్లో టంగ్‌స్టన్ వినియోగం అధికం

టంగ్‌స్టన్ అనే లోహం దృఢంగా ఉంటుంది. ఎక్కువ వేడిని తట్టుకుని నిలబడగలిగే లోహం. దీనినిఎక్కువగా పారిశ్రామిక యంత్రాల తయారీలో , ఎలక్ట్రికల్ విభాగాల్లోనూ కట్టింగ్ చేసే యంత్రాల్లోనూ వినియోగిస్తారు. ఇప్పటి వరకు దేశంలో లభ్యత ఆశించినంత లేకపోవడంతో బయట నుంచి దిగుమతులు చేసుకుంటూ ఉన్నారు. ఇది ఇక్కడ లభిస్తే కొంత వరకు దేశీయంగా లోటు భర్తీ చేసుకునేందుకు వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇది లభిస్తే జిల్లా పరిధిలో అదనంగా కొత్త లోహం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు ఇనుము, బంగారం, వజ్రాల అన్వేషణ, తవ్వకాలు నడుస్తూ వచ్చాయి. తాజాగా ఇప్పుడు టంగ్‌స్టన్ అనే ఖనిజమున్నట్టుగా భూగర్భ ఖనిజ శాఖ భావిస్తోంది. ఈ మేరకు ఈ ఖనిజం తవ్వకాలు, అన్వేషణ కోసం కేంద్ర ప్రభుత్వం హిందుస్తాన్ జింక్ సంస్థకు కట్టబెట్టింది. ఇప్పటికే భూగర్భ ఖనిజ సంస్థ ప్రాథమికంగా సర్వేలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అందులో వచ్చిన ప్రాథమిక నిర్ధారణలను బట్టి ఇక్కడ టంగ్‌స్టన్ ఉండవచ్చునని భావించి ఇప్పుడు యాక్షన్ చేపట్టారు. కాంపోజిట్ లైసెన్సు పొందిన ఈ సంస్థ రాబోయే రోజుల్లో మరింతగా శోధించి ఏ మేరకు ఉందన్నది నిర్ధారించుకునేందుకు ఈ లైసెన్సును పొందింది. అక్కడ పూర్తి స్థాయి ఫలితాలొస్తే ఖనిజ తవ్వకాలను ఆ సంస్థనే చేపట్టే అవకాశాలున్నాయి.

మైనింగుతో పర్యావరణంపైనా ప్రభావమెంత ?

టంగ్‌స్టన్ మైనింగు వలన పర్యావరణంపైనా ప్రభావముండే అవకాశముందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. తమళనాడులోని దిండిగల్ ప్రాంతంలో ఇదే రకంగా మైనింగుకు అనుతులొస్తే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మైనింగు వలన నీరు, పర్యావరణంపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే మార్గం

సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

'అనంత'లో ఘనంగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ హమాలీలు హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని అప్పుడే పాలక ప్రభుత్వాలు స్పందిస్తాయనిసివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభ అనంతపురం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో ఘనంగా జరిగింది. సీతారాం ఏచూరి ప్రాంగణంలో సిఐటియు జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆ సంఘం గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సివిల్ సప్లయ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఉదయభాస్కర్‌రావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరయ్యారు. తొలుత అమరులకు సంతాప తీర్మాణం ప్రవేశపెట్టగా మహాసభ నివాళులు అర్పించింది. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరరావు మూడు సంవత్సరాల్లో సంఘం ఆధ్వర్యంలో హమాలీల పక్షాన చేసిన పోరాటాలు, సాధించిన హక్కులు తదితర అంశాలపై నివేదిక ప్రవేశపెట్టి వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీలు శ్రమకు తగ్గ వేతనం అందడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అయితే మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు అదానీ, అంబానీ వంటి వారిని ప్రోత్సహిస్తూ శతకోటీశ్వరులుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ఉన్న కొద్ది మంది సంపన్నులకు 2 శాతం పన్ను విధించినా ఆ సొమ్ముతో దేశంలో, రాష్ట్రంలో ఉచితంగా నాణ్యమైన, మెరుగైన ప్రభుత్వ విద్య, వైద్యం, యువతకు గౌరవ ప్రదమైన ఉద్యోగాలు, ఉద్యోగ కార్మికులకు పెన్షన్‌లు, పేద ప్రజలకు పించన్‌లు శాశ్వతంగా అందించవచ్చన్నారు. కార్మికులకు పని తగ్గ వేతనం, భద్రత కల్పించడం లేదన్నారు. అదే కేరళా రాష్ట్రంలో కార్మిక, రైతు, ప్రజా పక్షపాత పాలక ప్రభుత్వం పని చేస్తుండటంతో అక్కడ పేదరిక నిర్మూలన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. అమెరికాలోని న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్టు భావాలు కలిగిన జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం చూస్తుంటే సోషలిస్టు విధానం, సిద్ధాంతాన్ని సమాజంకాంక్షిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దేశంలో కూడా కార్మికుల పక్షపాత ప్రభుత్వాలను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని తెలిపారు. న్యాయం చేయకపోగా కష్టజీవులు, శ్రామికులు, కార్మికుల మధ్య ఐక్యత లేకుండా చీలిక తెచ్చి బానిసత్వంలోకి నెట్టివేసే ధోరణులు అనుసరిస్తున్నాయని విమర్శించారు. అందు కోసమే కార్మిక లోకం ఐక్యమత్యంగా ఉండి పోరాడి హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హమాలీలను బరువులు మోసే గాడిదల్లాగా, ఎద్దులాగా భావించాలని చూస్తే ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. హమాలీలు రాజకీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు సివిల్ సప్లయ్ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలు చిన్న చూపు చూడటం అన్యాయంగా ఉందన్నారు. కార్మికులకు వేతనాలు, కనీస సౌకర్యాలు అమలు చేయమంటే ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. సమాజానికి కీలకమైన సేవలు అందిస్తున్న సివిల్ సప్లయ్ హమాలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఆయా జిల్లాల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తీర్మాణాలు ప్రవేశపెట్టి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారు.

25 మందితో నూతన కమిటీ : ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కె.ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులుగా ఆర్.కృష్ణ (కర్నూలు), ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు (అనంతపురం) జొన్నలగడ్డ కృష్ణ(కృష్ణ), శేఖర్ (ఏలూరు), రమేష్(పల్నాడు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉదయ భాస్కర్‌రావు (పశ్చిమగోదావరి), రాష్ట్ర కార్యదర్శులుగా రత్నరాజు (బాపట్ల), బి.రమేష్ (ఎన్టీఆర్), నాగరాజు (శ్రీసత్యసాయి), శ్యామ్ (తూర్పుగోదావరి), రమేష్ (నంద్యాల), కోశాధికారిగా ఈ.ఆంజనేయులు (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా శంకర్(కృష్ణా), ఈశ్వర్ (అనంతపురం), ఎస్.వీర్రాజు (తూర్పుగోదావరి), గోపాలరావు (ప్రకాశం), రాజు (పశ్చిమగోదావరి), శ్రీనివాస్ (పశ్చిమగోదావరి), నరేష్(కర్నూలు), వెంకటేష్(ఎన్టీఆర్), దాదాపీరా(బాపట్ల,) ఎం.రాంబాబు(ఏలూరు), గోపాల్(నంద్యాల)ను ఎన్నుకున్నారు.



మహాసభలకు హాజరైన ప్రతినిధులు



సివిల్‌సప్లయ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



బ్యాంక్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం హిందూపురం బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హిందూపురం బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ బి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకుల జాతీయకరణ, క్లరికల్, సబ్ స్టాఫ్ క్యాడర్లలో శాశ్వత నియామకాలు తదితర అంశాలపై నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యాలు, ప్రభుత్వాలు బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ఉద్యోగులు బాలకృష్ణ, త్రివేణి, శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గోరంట్ల విద్యార్థి

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తేజ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ కదిరి పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తేజ ప్రతిభ చాటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి తేజను ఉపాధ్యాయులు అభినందించారు.

సెపక్‌తక్రా పోటీల్లో 'మంగళకర' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని జగరాజుపల్లిలో ఉన్న మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఎస్కే యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల పోటీల్లో మంగళకర జట్టు గుంతకల్లు ఎస్‌కెపి కళాశాల జట్టుపై విజయం సాధించింది. కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో గుంతకల్లులో నిర్వహించిన సెపక్‌తక్రా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. వారిని కళాశాల మేనేజింగ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ప్రిన్సిపల్ సురేష్‌బాబు, ఏవో జయచంద్రారెడ్డి అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన 'పురం' న్యాయవాదులు

ప్రజాశక్తి-హిందూపురం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు మంగళవారం అమరావతిలో హిందూపురం న్యాయవాదులు కలిశారు. హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరువప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు ఇందాద్, శివశంకర్, కృష్ణమూర్తి తదితరులు జస్టిస్ రఘునందన్ రావు ను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. ప్రధానంగా జూనియర్ సివిల్ జడ్జి గత మార్చి నుండి లేకపోవడంతో కక్షిదారులు, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనికి తోడు పాత జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయస్థానం భవన సముదాయాలను కూల్చివేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

తనిఖీలతో చోరీలకు అడ్డుకట్ట : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంతోపాటు డివిజన్ వ్యాప్తంగా విరివిగా కార్డెన్ సర్చ్ తనిఖీలను ముమ్మరం చేసి ద్విచక్ర వాహన దొంగతనాలకు అడ్డుకట్ట వేస్తామని డిఎస్‌పి కె.వి. మహేష్ పేర్కొన్నారు. ఇటీవల ద్విచక్ర వాహన దొంగతనాలు ఎక్కువ కావడంతో దొంగతనాలను అరికట్టడానికి పట్టణంలో పలు ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ముమ్మరం చేశారు. దీంతోపాటు పట్టణంలో వివిధ ప్రాంతాలలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 8 మంది నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వీరి వద్ద 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్ పి వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో సిఐలు రాజగోపాల్ నాయుడు అబ్దుల్ కరీం జనార్ధన్ తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

నకిలీలపై చర్యలు : జర్నలిస్టుల పేరుతో కొంతమంది నకిలీ జర్నలిస్టులు వారి వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్నారని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని జర్నలిస్టులు కానీ వారు ప్రెస్ స్టిక్కర్ వారి వాహనాలపై వేసుకుంటే వాహనాలను సీజ్ చేయడంతో పాటుకఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి కెవి మహేష్ హెచ్చరించారు. డివిజన్ వ్యాప్తంగా చాలామంది జర్నలిస్టులు కానీ వారు సైతం ప్రెస్ స్టిక్కర్ వేసుకొని చలామణి అవుతున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు కోరారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రెస్ ముసుగులో అసాంఘిక శక్తులు తిరిగే ప్రమాదం ఉండడంతో దీనిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

బలవంతపు భూసేకరణను అడ్డుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-హిందూపురం

రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా బలవంతపు భూసేకరణ చేస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్ లో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిరీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వడ్డే శోభనాద్రీశ్వరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల ఎకరాల భూములను వివిధ కారణాలతో సేకరిస్తోందని, ఈ భూములు కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికేనని విమర్శించారు. రైతులు అంగీకారం లేకపోతే తీసుకొనే అధికారం ఎవరికీ లేదని, ప్రభుత్వాలు భూములు సేకరించాలంటే ముందుగా నోటీసులు జారీ చేసి రైతుల అభిప్రాయం మేరకే తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా భూపోరాట కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సలహాదారులుగా రాష్ట్ర నాయకులు గిరీష్, చైతన్య సంస్థ నాయకులు చైతన్య గంగిరెడ్డి, రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, కమిటీ కన్వీనర్ గా రంగనాయకులు, సభ్యులుగా నరసింహప్ప, సి.ఆర్ వెంకటరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గోపాలకష్ణ, రామచంద్ర రెడ్డి, నరసింహప్ప (జంగాలపల్లి), సుంకప్ప, మునిశంకర్, వెంకటేషప్ప, రామదాసును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాల నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేద్దాం

హిందూపురం : రాష్ట్రవ్యాప్తంగా పేదలకు వైద్య విద్యతో పాటు వైద్యాన్ని సైతం దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఈ ప్రయత్నాన్ని ప్రజాఉద్యమం ద్వారా విఫలం చేద్దామని వైసిపి నేత వేణు రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాఉద్యమ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ స్థాయి నాయకులతో మంగళవారం పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశించారు. అనంతరం కార్యాలయం ముందు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, పట్టణ, రూరల్ పార్టీ కన్వీనర్లతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

15న విజయవాడలో మహిళా సదస్సు

ప్రజాశక్తి-హిందూపురం

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15 విజయవాడలో జరిగే మహిళా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం మహిళా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 15వ తేదీన విజయవాడ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ లో ఈ మహిళా సదస్సు జరుగుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దాడులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై మహిళా సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సరస్వతి, లక్ష్మీదేవి, రత్నమ్మ, అంజలి,, సునీతమ్మ, పద్మక్క తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

సత్యసాయి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

రాష్ట్రమంత్రుల బృందం



పనుల ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తిలో జరగనున్న సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఉత్సవాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం పేర్కొంది. మంత్రుల బృందంలో సభ్యులైన రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మాత్యులు సవిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు మంగళవారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులు, సత్య సాయి ట్రస్టు సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన సన్నాహాలు, భద్రతా ఏర్పాట్లు, వసతి, రవాణా, వైద్య సేవలు మరియు ప్రజా సౌకర్యాలపై విస్తతంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పూర్తి చేయడమే అంతిమ లక్ష్యం కావాలన్నారు. ట్రస్టు సభ్యులు సూచించిన సలహాలు, సూచనలు కూడా దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి వచ్చే సందర్భంలో ఎటువంటి వైద్య అత్యవసర పరిస్థితులు తలెత్తినా తక్షణ స్పందన ఇవ్వగల మొబైల్ మెడికల్ యూనిట్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా వస్తున్నారని అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలన్నారు. అంతకు ముందుగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ శతజయంతి ఉత్సవాలకు సంబంధించి పుట్టపర్తిలో చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, డిఐజి షిమోషి, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, జిల్లా అధికారులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ పోస్టర్లు ఆవిష్కరణ : సత్య సాయి బాబా శత జయంతి సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత డ్వాక్రా బజార్- 2025 ప్రచార వాల్ పోస్టర్లను రాష్ట్ర మంత్రులబృందం తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక శిల్పారామంలో ఈనెల 15 నుండి 25 వరకు స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు మరియు ఆహార ఉత్పత్తుల ప్రదర్శన హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు డ్వాక్రా బజార్లో అమ్మకాల నిమిత్తం స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతిరోజు సంగీత నృత్య ప్రదర్శనలు శిల్పారామంలో ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి నరసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

చిలమత్తూరు ప్రజాశక్తి పాత్రికేయునిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని పాత్రికేయులు డీఎస్పీ శివనారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంపై పాత్రికేయుడు శంకర్ వార్త రాయగా, జీర్ణించుకోలేని కాంట్రాక్టర్ నాగరాజుయాదవ్, అతని కుమారుడు హరీష్ భౌతికంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భవిష్య త్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో పాత్రికేయులు శ్రీనివాసులు, రవికుమార్, సునీల్‌కుమార్, ఫారుక్, రహంతుల్లా, నాగేష్, ఎల్లంరాజు, హరి, చంద్రారెడ్డి, మాధవ్ ఉన్నారు.

కొత్తచెరువు : చిలమత్తూరు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రావణి ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డు నాసిరకంగా వేస్తున్నారని పత్రికలో వార్త రాసినందుకు టిడిపి నాయకులు నాగరాజు యాదవ్, కుమారుడు హరీష్‌యాదవ్ విలేకరిపై దాడికి పాల్పడడం, ఆయన కుటుంబ సభ్యులను బెదిరించడం తగదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, సిద్దు, శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : చిలుమత్తూరు ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన టిడిపి నాయకులు జి.నాగరాజుయాదవ్, హరీష్ యాదవ్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణంపై ఉన్నత స్థాయి అధికారులతో క్వాలిటీ కంట్రోల్ చెక్ చేయించి అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సిపిఎం నాయకులు లక్ష్మినారాయణ, పైపల్లి గంగాధర్, పెడబల్లి బాబావలి, తదితరులు కోరారు.



చిలమత్తూరులో ఆర్ఐ గురు ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు

చిలమత్తూరు : ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసిన నాగరాజు యాదవ్, హరీష్‌యాదవ్, వారి అనుచరులను పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మండల తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అధికార మదంతో నిజాలు వెలికితీసే పాత్రికేయులపై దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐ గురు ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చౌడప్ప, ఆదినారాయణ, ఆంజనేయులు, సూర్యప్రకాష్, చౌడిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ : పాత్రికేయుడు శంకర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, హరి, శంకర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, తిమ్మప్ప, హనుమంతు, పవన్, ఇర్ఫాన్, నరసింహమూర్తి, వేణు, నాగరాజు, కృష్ణారెడ్డి, మంజునాథ్, గోవిందప్ప, త్రిలోక్, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథ్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మందులు, ఎరువులు అతిగా వాడొద్దు : డిఎఒ

ప్రజాశక్తి-రొద్దం

రైతులు పంటలకు మోతాదుకు మించి యూరియా, ఎరువులు వాడరాదని జిల్లా వ్యవసాయ అధికారి(డిఎఒ) రామునాయక్ సూచించారు. పొలంపిలుపులో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని ఆర్.లోచర్ల, దొడగట్ట గ్రామాల్లో పర్యటించారు. మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. రొద్దంలో తిరుమల ఫర్టిలైజర్ షాపును సందర్శించి రికార్డులు, స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎరువులను ఎంఆర్‌పికే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ ఆర్.లోచర్ల రైతు సేవా కేంద్రంలో శెనగలు(బెంగాల్ గ్రామ్)విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకో వాలని సూచించారు. వారి వెంట ఎంఎఒ, ఆర్ఎస్‌కె ఉద్యోగులు పి.యోగేష్, ఎంపిఈఓలు అశోక్, జాఫర్, విహెచ్ఎ పి.కవిత, టిడిపి నాయకులు మురళి, డీలర్ రామాంజనేయులు, సర్పంచి గంగాధర్, ఉన్నారు.



రొద్దం : దొడగట్టలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గాండ్లపెంట : పొలం పిలుపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లేపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కదిరి ఎడిఎ సనావుల్లా, ఏవో సయ్యద్ షాదాబ్ వలి పంటలో సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో త్వరలో 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తామన్నారు. రబీలో సాగు చేసే రైతులకు విత్తన వేరుశనగ అందజేస్తామన్నారు. జిప్సం 50 కిలోల బ్యాగు రూ. 195 చొప్పున 4 బస్తాలు ఇస్తామని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వారి వెంట వ్యవసాయ సిబ్బంది మనోహర్, అశ్విని, రైతులు ఉన్నారు.

సోమందేపల్లి : మండలంలోని ఈదులబల్లాపురం గ్రామంలో ఏవో విజయభారతి ఆధ్వర్యంలో పొలం పిలుపు కార్యక్రమం చేపట్టారు. ఆమె రబీలో సాగు చేసే వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల్లో విత్తనశుద్ధి, విత్తన మోతాదు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కందిలో తెగుళ్ల నివారణకు మందులను సూచించారు. ఆమె వెంట ఎఇఒ అలేఖ్య, రైతులు ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

గోరంట్ల : మండలంలోని వానవోలు గ్రామ పంచాయతీ ఉన్నత పాఠశాలకు మంగళవారం పూర్వ విద్యార్థులు వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేసినట్లు హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ అందించడానికి పూర్వవిద్యార్థులు వాటర్ ప్యూరిఫైర్ అందజేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ రామాంజనేయులు, వైస్ ఛైర్మన్, దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గోరంట్ల : పట్టణంలోని ఆంజనేయ స్వామి కాలనీలో నివాసం ఉంటున్న ఇమామ్‌బి కుమార్తె అమ్మాజాన్ అనారోగ్య కారణంగా మంగళ వారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి అమ్మాజాన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఎంఆర్‌సి స్కూల్ సమీ పంలో నాగేంద్ర అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.

ఆయుర్వేద పిహెచ్‌సి తనిఖీ

గుడిబండ : మండలంలోని మోరుబాగల్ గ్రామం లో ఉన్న ఆయుర్వేద పిహెచ్‌సిని మంగళవారం తహశీల్దార్ శ్రీధర్ తనిఖీ చేశారు. రోజూ ఓపిల సంఖ్య, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పరిశు భ్రత, తదితర అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామాల్లో సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు

పారిశ్రామిక పురోగతికి సహకరిస్తాం : ఎంపీ

ప్రజాశక్తి-పెనుకొండ

పారిశ్రామిక పురోగతికి సహకరిస్తామని హిందూపురం ఎంపి పార్థ సారథి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. యువతీ, యువకులు పారిశ్రామిక నైపుణ్యాలు పెంపొందించుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకోవాలని సూచించారు. 'పరిశ్రమలు–ఉపాధి కల్పన' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అమ్మవారుపల్లి పారిశ్రామికవాడలో పిహెచ్ఎ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పనులకు సిఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో భూమిపూజచేశారు. ముఖ్య అతిథిగా ఎంపి హాజరయ్యారు. జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పరిశ్రమలు, రాబోయే పరిశ్రమలు, వాటి పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు రావటం వల్ల కలిగే ఉపాధి అవకాశాలను వివరించారు. పిహెచ్ఎ యూనిట్ మేనేజింగ్ డైరెక్టర్ మాన్ షుక్ కిమ్ మాట్లాడుతూ ఇది వరకే రెండు రాష్ట్రాల్లో ఇలాంటి యూనిట్లు ఉన్నాయని, ఇది మూడవది అని, ఇందులో త్వరగా ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. ఎంపి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో పి.ఆనంద్‌కుమార్, తహశీల్దార్ కె.స్వాతి, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ దేవకాంతమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి బికె.పార్థసారధి

సజావుగా మండల సమావేశం

ప్రజాశక్తి- అమరాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి ఈరన్న అధ్యక్షతన ఎంపిడిఒ రామా రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి, ఎపిఐఐసి డైరెక్టర్ రామకృష్ణలను అధికారులు, సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎంపిటిసి కెంచప్ప మాట్లాడుతూ ఓ రైతు పొలానికి దారి సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు. బసవనపల్లి ఎస్సీ కాలనీలో జనావాసాల మీదుగా విద్యుత్ లైన్ ఉందని మార్చాలని ఎంపిపి విద్యుత్ అధికారి సిద్దేశ్వరకు సూచించారు. అమరాపురంలో పాల డెయిరీ కేంద్రం ఏర్పాటు చేయాలని సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ కోరారు. వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలను వివరించారు. సమావేశంలో జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సానెవారిపల్లెలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని సానెవారిపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణ అధికారి డాక్టర్ జి.వెంకటేషులు మాట్లాడుతూ రూ. 500 విలువ చేసే లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారం ద్వారా పూర్తిగా ఉచితంగా వేస్తారన్నారు. దీని ద్వారా పాడి రైతులలు మేలు జాతి అధిక పాల దిగుబడినిచ్చే పెయ్యదూడలను పొందవచ్చు అని తెలిపారు. శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్.రామేశ్వరరావు, పాడి రైతులు, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సచివాలయ ఉద్యోగులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లించాలని, తక్షణమే ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో వైద్య ఖర్చులను భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయమై పలుమార్లు కమిషనర్, పట్టణ పరిపాలన విభాగ అధికారులను సంప్రదించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు వార్డుల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించిన సచివాలయ ఉద్యోగులు

ఎంఎండిఎ ఆధ్వర్యంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్(ఎంఎండిఎ) కార్యాలయంలో మంగళవారం మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎండిఎ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రోషన్ జమీర్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతు న్నాయన్నారు. ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప మైనార్టీల సంక్షేమ కోసం కృషి చేయడంలో విఫలమయ్యారన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎండిఎ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ దాదాపీర్, కలీమ్, సాజిద్, ఖాసిం, మహబూబ్‌బాషా, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వాసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులకు ప్రతి నెలా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగా మంగళవారం సేవా సమితి సభ్యులైన స్వరాజ్యలక్ష్మి భర్త సూర్యనారాయణ ఆధ్వర్యంలో 150 మంది వరకూ భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సోమశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్, ఆసుపత్రి సిబ్బంది, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

పుట్టపర్తి నియోజకవర్గ సీనియర్ వైసిపి నేత, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు కొడపగానిపల్లి రఘునాథ్‌రెడ్డి ఇటీవల గుండెపోటుకు గురై అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని, యువతకు మౌలానా ఆదర్శప్రాయుడని డిఆర్ఒ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మౌలానా కేంద్ర మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రిగా పని చేసి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎంఇఒ ఖాదర్‌వలి, ఎఎంఒ అబ్దుల్ మాలిక్, పెను కొండ అహ్మద్, పఠాన్ రుబీనా, సైపుల్లా తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జగన్మోహన్‌రావు, జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి గౌస్‌మొహిద్దిన్, డిపిఒ మధుసూదన్‌రెడ్డి, కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీషా, డిఇవో జి.కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పోలీస్ అధికారులు మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐలు మోహన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు అమోఘమని పట్టణంలోని శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.జయప్ప పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సం ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు ఐక్యూఎసి కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్ఎస్ఎస్ పిఒ కాంతారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కె.సుదర్శన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ఎం.శ్రీలేఖ, డి.శివన్న, కె.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, బాలమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని అచ్చామియాపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కట్టుబడి గౌస్ లాజమ్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సయ్యద్, శర్మాస్‌వలి, విద్యార్థులు గ్రామస్తులు, పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : దేశంలో నూతన విద్యావిధానాలకు ఆద్యుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కళాశాలలో డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి రమేష్, ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీనివాసులు, అకడమిక్ ఇన్‌ఛార్జి కృష్ణయ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి సునీతబాయి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా..

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

టిడిపి కార్యకర్తలు 20 ఏళ్లుగా నిస్వార్థంగా నాతో ప్రయాణం చేస్తున్నారని, ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భరోసా ఇచ్చారు. నియోజ వర్గంలో 90వేల పైచిలుకు సభ్యత్వాలు చేశామంటే ఇది మనందరి ఘనత అన్నారు. పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారందరికీ సము చిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీ విధి విధానాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. 'మన ఊరి కోసం కష్టపడాలి, మన ఊరు అభివృద్ధి కోసం పాటుపడాలి' నినాదంతో ముందుకెళ్లాలన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల అసంపూర్తి భవనాలను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. త్వరలోనే బైపాస్ రోడ్డును పూర్తి చేస్తామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన వారిని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వహీద్‌హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ధర్మవరం రూరల్ : సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం పట్టణంలోని మంత్రి సత్యకుమార్‌యాదవ్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి హరీష్‌బాబు లబ్ధిదారుల కు అందజేశారు. మొత్తం 25 మంది లబ్ధిదారులకు రూ. 35,57,807 విలువైన చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు ఓ వరం అన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

సోమందేపల్లి : మండలంలోని బ్రాహ్మణపల్లి, మంచేపల్లి, హుస్సేన్‌పురం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం సిడిపిఒ శాంతలక్ష్మి తనిఖీ చేశారు. సెంటర్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని, రిమోట్ లర్నింగ్ మెథడ్‌లో వస్తున్న వీడియోల ఆధారంగా పిల్లలకు విద్యాభ్యాసం చేయాలని, సిలబస్ క్యాలెండర్ ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

ముదిగుబ్బ : మండలంలోని తిమ్మానా యునిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపిడిఒ .శకుంతల, ఎంఇఒ రమణప్ప పరిశీలిం చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహార మెనూ ఎలా అమలు చేస్తున్నారని ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వారి వెంట ఉపాధ్యాయులు రంగనాయకులు, సిబ్బంది ఉన్నారు.

నేడు వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- పెనుకొండ టౌన్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టనున్న 'ప్రజా ఉద్యమం' భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ర్యాలీ ఉదయం 9 గంటలకు వై జంక్షన్ నుంచి వైద్య కళాశాల వరకూ నిర్వహిస్తామని, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.



'ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

వైసిపి 'ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ

గుడిబండ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ మడకశిరలో చేపట్టే ప్రజాఉద్యమం ర్యాలీ పోస్టర్‌ను మంగళవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో ఆ పార్టీ సమన్వయకర్త ఎస్.ఎల్. ఈరలక్కప్ప ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బుధవా రం మడకశిరలో చేపట్టనున్న ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కరుణాకర్, హనుమంతరాయప్ప, పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పరిగి

దళారుల వల్ల మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయానలి మండల సర్వసభ్య సమావేశం లో సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో మంగళవారం ఎంపిపి సవిత ప్రభాకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై గళమెత్తారు. రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలని కొందరు కోరగా, నాన్ యూరియా, నాన్ డిఎపి వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉందని పలువురు తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేశామని ఏవో శ్రీకృష్ణ తెలిపారు. పేదలు ఇంటి నిర్మాణం కోసం నెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవ చ్చని గృహ నిర్మాణ శాఖ అధికారి సునీత తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని తహశీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల బిల్లులు ఇచ్చేందుకు అధికార పార్టీ నాయకులతో, కొందరు అధికారులు అడ్డుకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిటిసి మాట్లాడుతూ తమకు సరైన గుర్తింపు లేదని, 10 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వడంలేదని మండిపడ్డారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలాన్ని బాల్య వివాహాల రహితంగా మార్చడానికి కృషి చేద్దామని సమతా ఎన్జీవో ప్రతి నిధులు పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయంలో మంగళవారం సమత ఎన్జీవో ఆధ్వర్యంలో సర్పంచి, ఎంపీటీసీ, వార్డు మెంబర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే బాల్య వివాహ నిషేధ చట్టంపై చర్చించారు. ఇకపై మన పంచాయతీ లో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా సమిష్టిగా కృషి చేద్దామని తీర్మానించారు. సమతా మండల కోఆర్డినేటర్ శ్రీనివాసన్‌నాయుడు, శారద, సర్పంచి పంచరత్నమ్మ, పంచాయతీ సెక్రటరీ నరేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్, స్కూల్ హెచ్ఎం, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో రూ. 35 కోట్ల వ్యయంతో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఎపి ప్రగతిశీల చేనేత కార్మిక సంఘం రాయలసీమ జోన్ కన్వీనర్ పోలా లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 9.8 ఎకరాల విస్తీర్ణంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న వేలాదిమంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే చేనేతలకు నేతన్న భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, జిఎస్టి రీయింబర్సెమెంట్, పక్కా ఇల్లు, తదితర ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆయనతో పాటు చేనేత కార్మిక సంఘం నాయకులు చంద్రమౌళి, ఆంజనేయులు, బాలనారాయణ, రఫీ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి ప్రధాన రహదారిలో అడ్డంగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచాయతీ కార్యదర్శి నాగరాజుకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్థానిక వైఎస్ఆర్ విగ్రహం నుంచి నంది విగ్రహం వరకూ రోడ్డుకు ఇరువైపులా చికెన్ సెంటర్లు, హోటళ్ల ముందు వాహనాలు నిలపడంతో ఆలయానికి వచ్చే యాత్రికులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయ న్నారు. కావున ఆ మార్గంలో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని, అడ్డుగా ఉన్న దుకాణాల బోర్డులను వెంటనే తొలగించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ సద్రుద్దీన్, నాగేంద్ర, ఫైజుల్లా, తిప్పారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-తలుపుల

పంచాయతీ పరిధిలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ రమణప్పనాయుడు తెలిపారు. స్థానిక కుమ్మరపేటలో పైప్‌లైన్ చెత్తచెదారంతో నిండిపోయి నీటి సమస్య నెలకొనడంతో పంచాయతీ సెక్రటరీ శభ్రం చేయించి పైపులైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓబుల్‌రెడ్డిపల్లి రోడ్డులో డ్రెయినేజీ కాలువ చెత్త చెదారం తో నిండిపోగా శుభ్రం చేయించారు. ఎక్కడైనా నీరు, చెత్త, వీధి దీపాలు, తదితర సమస్యలు ఉంటే ఇబ్బందులు తెలపాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ వాటర్ మెన్స్, కార్మికులు మహబూబ్ బాషా, నారాయణ, ఇమామ్, నరేంద్ర ఉన్నారు.

'టిడిపి కోసం పనిచేసిన వారికి గుర్తింపులేదు'

ప్రజాశక్తి-కొత్తచెరువు

టిడిపిలో ఎన్నో ఏళ్లుగా ఉంటూ పార్టీ కోసం అంకితభావంతో సేవలందిస్తున్న తమను గుర్తించలేదని వడ్డెర సంఘం టిడిపి నాయకులు ఆలకుంట పెద్దన్న, ఆలకుంట ప్రసాద్, శ్రీనివాసులు, నామాల విజయ్‌కుమార్, బాలాజీ ఆవేదన వ్యకం చేశారు. వీరు మంగళవారం స్థానికబీసీ కాలనీలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలోల పార్టీ అభ్యర్థుల విజయం కోసం తాము ఎంతో కృషి చేశామని, అయితే గెలిచిన తరువాత తమను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గుర్తించలేదని వాపోయారు. వలిపి శ్రీనివాసులు అనే ఒక వ్యక్తికే నాలుగు పదవులు కేటాయించారని, పనులు కూడా ఆయనకే ఇస్తున్నారని పేర్కొన్నారు. కొత్త చెరువులో ఎంతోమంది వడ్డెర్లు టిడిపి కోసం పని చేసినా ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం ఏర్పడుతుందని, ఇకనైనా అధిష్టానం కష్టపడిన వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. వారితో పాటు వెంకటేశు, రమేష్ ఉన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

తలుపుల : గ్రీన్ ఫీల్డ్ సిక్స్ లైన్ హైవే నిర్మాణంలో భాగంగా మండలంలోని గొల్లపల్లితండా శివారు ప్రాంతంలో తీసిన గుంతలో పడి ఒకరు మృతిచెందారు. వివరాలు.. కదిరి రూరల్ పరిధిలోని ఎర్రదొడ్డి బోడేనాయక్ తండాకు చెందిన జగదీష్‌నాయక్ తన చిన్న కూతురిని గొల్లపల్లితండాకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. దీంతో జగదీష్‌నాయక్ చిన్నకూతురి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లి ప్రమాదశాత్తూ కాలు జారి నీటి గుంతో పడిపోయారు. గమనించిన రైతు వినోద్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. అలాగే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నరసింహుడు సిబ్బందితో అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మృతదేహాన్ని తీశారు. జగదీష్‌నాయక్‌కు భార్య అమ్ములుభాయ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్ట్

ధర్మవరం రూరల్ : రూరల్ పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 10,150 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో పోలీసులు మురళి, నాగరాజు పాల్గొన్నారు.